సాక్షి
శ్రీకాకుళం
మంగళవారం : 9 : మే : 2023



'నీట్' తప్పతానేమోనని..

నీట్ పరీక్ష తప్పుతానేమోనని ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రీకాకుళంలో ఘటన చోటుచేసుకుంది. - 8లో



అంకితభావంతో విధులు..

పోలీసులు అంకితభావంతో విధులు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. విధానాలపై దిశానిర్దేశం చేశారు. - 8లో



మండలం	గరిష్ఠం	కనిష్ఠం
ఆమదాలవలస	38°	26°
ఇచ్ఛాపురం	38°	26°
పాతపట్నం	38°	26°
శ్రీకాకుళం	37°	25°

న్యూస్‌రీల్

14 నుంచి ట్రిపుల్ ఐటీకి సెలవులు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) క్యాంపస్‌కు ఈ నెల 14 నుంచి జూన్ 4వరకు వేసవి సెలవులు ఇస్తున్నట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు అన్నారు. ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఆయన సోమవారం మాట్లాడారు. సెమిస్టర్ పరీక్షలు ముగియటంతో సెలవులు ఇస్తున్నట్లు చెప్పారు. ట్రిపుల్ ఐటీ వసతి గృహాల్లో పూర్తిస్థాయిలో రన్నింగ్ నీటి సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఎస్పీని కలిసిన ఎక్సైజ్ సూపరింటెండెంట్


పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన వై.ఆదినారాయణ సోమవారం ఎస్పీ జీఆర్ రాధికను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆమెను కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

రేపటి నుంచి బాస్కెట్‌బాల్, సెపక్‌తక్ర శిక్షణ శిబిరాలు



శిక్షణ శిబిరాల పోస్టర్

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా స్థాయి వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో భాగంగా ఈనెల 10 నుంచి బాస్కెట్‌బాల్, సెపక్‌తక్ర క్రీడాంశాల్లో ఉచిత శిక్షణ మొదలుకానుంది. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ క్రీడామైదానం వేదికగా బుధవారం సాయంత్రం 5 గంటలకు ఈ శిబిరాలు ప్రారంభం కానున్నాయని జిల్లా కోచ్ గాలి అర్జునరావురెడ్డి తెలిపారు. ఈ శిక్షణ శిబిరాలను ఆ క్రీడాంశాల జిల్లా చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రతిరోజు ఉదయం 6 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 7 వరకు శిక్షణను ఉచితంగా అందిస్తామన్నారు. ఔత్సాహిక క్రీడాకారులు, బాలబాలికలు హాజరై సద్వినియోగం చేసుకోవాలని అర్జున్ కోరారు. మరిన్ని వివరాలకు 99492 91288 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

'ఎక్కువ కేసులు పరిష్కరించాలి'


వీసీలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: రానున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని, రాజీ మార్గంపై కక్షిదారుల్లో అవగాహన కల్పించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. ఆయన సోమవారం తన చాంబర్‌లో జిల్లాలోని న్యాయాధికారులందరితో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. మే 13న జరిగే లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసి నాయుడు పాల్గొన్నారు.

పాలీసెట్‌కు సర్వం సిద్ధం

ఎచ్చెర్ల క్యాంపస్: పాలీసెట్–2023 పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, జిల్లా ప్రవేశాల సమన్వయ కర్త జి.రాజశేఖర్ అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం పాలీసెట్ పరీక్ష నిర్వహణ ఏర్పాట్లు, నిర్వహణ విధానంపై పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 10న పాలీసెట్ ప్రవేశ పరీక్ష ఉదయం 11 నుంచి 1 గంట వరకు నిర్వహిస్తామని, శ్రీకాకుళం, టెక్కలి డివిజన్లలో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. శ్రీకాకుళం డివిజన్ పరిధిలో 32 పరీక్ష కేంద్రాల్లో 7511 మంది విద్యార్థులు, టెక్కలి డివిజన్‌లో 16 పరీక్ష కేంద్రాల్లో 4852 మంది విద్యార్థులు హాజరు కానున్నారని అన్నారు. పరీక్ష ఆన్‌లైన్ పద్ధతిలో జరుగుతుందని, పరీక్షలు పక్కాగా నిర్వహించాలని సూచించారు. టెక్కలి సమన్వయ కర్త శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

విద్యా యజ్ఞం

విశేష ఫలం

నాలుగేళ్లుగా ప్రభుత్వ బడుల్లో జరుగుతున్న సంక్షేమ యజ్ఞ ఫలితాలు ఇప్పుడు అందుతున్నాయి. ఈ నాలుగేళ్లలో స్కూళ్ల రూపురేఖలు మారాయి. విద్యార్థి మెనూలో కొత్త పదార్థాలు చేరాయి. పిల్లల చేతికి పుస్తకాలతో పాటు కానుకలు వచ్చాయి. బోధనలో వినూత్న పద్ధతులు కనిపించాయి. ఫలితంగా కార్పొరేట్ బడుల కంటే మిన్నగా ఈ ఏదాది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు టెన్త్‌లో అదరగొట్టారు. సామాన్య కుటుంబాల నుంచి వచ్చి అసామాన్య ఫలితాలు సాధించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ప్రయత్నానికి అందిన తొలి ఫలమిది.

–సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం



నేడు: సుందరమైన శోభను సంతరించుకున్న శ్రీకాకుళం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల (ఇన్‌సెట్లో) నాడు: శ్రీకాకుళం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల



- పాతపట్నంలో పంక్చర్లు వేసుకుంటూ కుటుంబాన్ని నడిపిస్తున్న దుర్గా ప్రసాద్ మహాపాత్రో కుమారుడు మిట్టు మహాపాత్రో ప్రభుత్వ పాఠశాలలో చదివి 594 మార్కులు సాధించి స్టేట్ టాపర్‌గా నిలిచాడు.



- ఆమదాలవలసలో ఎల్ఐసీ ఏజెంట్‌గా పనిచేస్తూ, సామాన్య జీవనం గడుపుతున్న పేడాడ బాబూరావు తన కుమారుడు షణ్ముఖ వికాస్‌ను మున్సిపల్ హైస్కూల్‌లో చదివించారు. 591మార్కులు సాధించి స్టేట్‌లో ఒక టాపర్‌గా నిలిచారు.



- వజ్రపుకొత్తూరు మండలం ఒంకులూరుకు చెందిన కొండప్ప ధనరాజు వ్యవసాయ కూలీ. సెంటు భూమి, సొంత ఇల్లు లేని ధనరాజు తన కుమార్తె ఇందును ప్రభుత్వ పాఠశాలలో చదివించారు. ఇప్పుడా అమ్మాయి 590మార్కులు సాధించింది.



- పాతపట్నంలో ఆటో నడుపుకుంటూ జీవిస్తున్న ఉర్లాం మన్మధరావు తన కుమార్తె జాహ్నవిని సారవకోట కేజీబీవీలో చదివించారు. ఆమె 590 మార్కులు సాధించింది.

- ఈ రంగానికి సీఎం జగన్ అత్యంత ప్రాధాన్యం
- అనేక పథకాలతో సర్కారీ విద్య పరిపుష్టం
- టెన్త్, ఇంటర్‌లో ఉన్నత ఫలితాలకు అవే పునాది

బడులకు ఏం చేశారంటే..?



- నాడు-నేడు మొదటి ఫేజ్ కింద 1247 పాఠశాలను రూ. 288.22కోట్లతో సుందరంగా తీర్చిదిద్ది, మౌలిక సదుపాయాలను కల్పించారు.
- రెండో ఫేజ్ కింద రూ.427.73కోట్లతో 1096 విద్యాసంస్థలను తీర్చిదిద్ది, మౌలిక సదుపాయాలను కల్పించే పనులు చేపడుతూనే ఉన్నారు.
- ఆర్వో ప్లాంట్‌ల ద్వారా మినరల్ వాటర్‌ను బడుల్లో అందిస్తున్నారు.
- సీబీఎస్ఈ సిలబస్‌కు అనుగుణంగా బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను 8వ తరగతి విద్యార్థులకు అందజేయడమే కాకుండా 10వ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన మెటీరియల్స్‌ను సరఫరా చేశారు. పాఠాలను డిజిటలైజేషన్ రూపంలో అందించారు.



- జగనన్న విద్యాకానుక ద్వారా యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, నోట్‌పుస్తకాలు, షూ, సాక్సులు, టై, బ్యాగ్, డిక్షనరీ వంటి వస్తువులను ఉచితంగా అందించారు.
- అమ్మ ఒడితో పాటు టీచ్ టూల్ పేరిట పాఠం ఎలా ఉండాలి, విద్యార్థులను ఏవిధంగా మోటివేట్ చేయాలి, మానసికంగా ఎలా సిద్ధం చేయాలనే అంశాలపై ఉపాధ్యాయులకు అవగాహన తరగతులు నిర్వహించారు.
- స్టెప్ అనే కార్యక్రమం పేరిట ప్రభుత్వం ప్రత్యేకంగా చేపట్టింది. ఆంగ్ల పత్రిక హిందూ సౌజన్యంతో తరగతిలో ఇంగ్లిష్ వాడకాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది.
- ఈఎండీపీ (ఎంటర్‌ప్రెన్యూర్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం) పేరిట విద్యార్థుల్లో పారిశ్రామిక వేత్తల లక్షణాలను అలవర్చే విధంగా ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశాలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు.
- లిప్ (లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం) పేరిట విద్యార్థుల చదువులు ఏ స్థాయిలో ఉన్నాయి ? ఏ శ్రేణికి చెందినవారో, ఏయే సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నారో తెలుసుకుని, సవరణాత్మక బోధన ద్వారా వాటిని ఏ విధంగా అధిగమించాలో అవగాహన కల్పించారు.
- టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్ఎం)ను అందించి, ఉత్తమ బోధన ఏ విధంగా జరిపించాలో ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు.



- రాష్ట్రంలో అత్యున్నత మార్కులు సాధించిన 28 మంది జాబితాను అధికారులు వెల్లడించగా అందులో మన జిల్లాకు చెందిన నలుగురు ఉండడం విశేషం.
- వీరే కాదు జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో 500కిపైగా మార్కులు సాధించిన విద్యార్థులు వందల్లో ఉండటం విశేషం.
- జిల్లాలోని 34 ప్రభుత్వ పాఠశాలలు 100శాతం ఉత్తీర్ణత శాతం సాధించాయి.
- జీరో శాతం ఉత్తీర్ణత బడులు గతంలో ఉండేవి. ఇప్పుడు అలాంటివి లేనేలేవు.
- ప్రభుత్వ పాఠశాల్లో చదివిన పిల్లలు 81.39శాతం మంది ఉత్తీర్ణులయ్యారు.

ప్రభుత్వ ప్రోత్సాహంతోనే..

నేను చదివిన పాఠశాలలో సబ్జెక్ట్ టీచర్స్ అందుబాటులో ఉండడంతో నాకు ట్యూషన్లకు వెళ్లే అవసరం రాలేదు. నాపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండా అమ్మ ఒడి, విద్యా కానుక వంటివి సాయం చేశాయి. మరో పక్క ప్రభుత్వం వారం వారం నిర్వహించే డీఓటీ పరీక్షలు చాలా బాగున్నాయి. అత్యధిక మార్కులు సాధించేందుకు పరీక్షల విధానం కూడా కారణం. ప్రభుత్వ బడి అంటేనే నాకు ఎక్కువ మక్కువ. మంచి క్వాలిఫైడ్ టీచర్స్ ఉన్నారు.

– కొండప్ప ఇందు, 590 మార్కులు, వజ్రపుకొత్తూరు

- వీడియోలు, ప్రశ్నాపత్రాల ద్వారా ఆరు పేపర్ల ప్రశ్నాపత్రాలపై స్పష్టమైన అవగాహన కల్పించారు.
- పాఠశాలల పనివేళలకు ముందు, అనంతరం రోజుకు రెండు గంటల చొప్పున ప్రత్యేక తరగతులు నిర్వహించారు.
- టార్గెట్ ఓరియెంటెడ్ ప్రోగ్రాం ద్వారా సెప్టెంబర్ నుంచి ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించి బాగా చదివిన పిల్లలు, వెనుకబడిన పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించారు.
- డాట్ (డెయిలీ ఆన్‌లైన్ టెస్ట్) పేరిట డిసెంబర్ వరకు బోధనపై దృష్టిసారించి, జనవరి 23 నుంచి ప్రతిరోజు నాలుగేసి సబ్జెక్టుల్లో 20 మార్కుల ప్రశ్న పత్రాలను మార్చి 20 వరకు సుమారు 200 ప్రశ్నాపత్రాలతో విద్యార్థులను సిద్ధం చేశారు.
- చురుగ్గా ఉండే విద్యార్థులకు రోజుకు ఒక సబ్జెక్టులో 100 మార్కుల ప్రశ్న పత్రాన్ని రాయించి, వారానికి ఆరు సబ్జెక్టులు కవరయ్యే విధంగా పరీక్షలను నిర్వహించి ఉత్తమ ఫలితాలను రాబట్టారు.
- రెండు పీరియడ్ల సిద్ధాంతం బాగా ఉపకరించింది. దీని ఉద్దేశం ఏంటంటే మొదటి పీరియడ్‌లో ప్రశ్నాపత్రంతో జవాబులను చదివించడం, రెండో పీరియడ్‌లో వాటిని రాయించడం, ఆ వెంటనే మూల్యాంకనం చేయడం.



- జగనన్న గోరుముద్ద ద్వారా పౌష్టికరమైన, రుచికరమైన ఆహారాన్ని అందించారు.

'ఈకేవైసీ పూర్తి చేయాలి'


సమావేశంలో మాట్లాడుతున్న డీడీ రవికుమార్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉద్యోగులు తప్పనిసరిగా ఈకెవైసీ చేయాలని జిల్లా ఖజానా శాఖ ఉప సంచాలకులు రవికుమార్ జిల్లా అధికారులను కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో ఈకెవైసీ, రోజువారీ, ఎస్ఎంఆర్, ఔట్ సోర్సింగ్, క్రమశిక్షణ చర్యల కేసులు, సీపీఎస్, ఎంటీఎస్‌లపై డీడీఓలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సీఎఫ్ఎంఎస్ ఐడీ, ఆధార్ నంబర్‌కు అనుసంధానం చేయడం, హెచ్ఎంఆర్ఓఎస్ ఐడీ, జనవరి 20 నాటికి ఈకెవైసీ పూర్తి చేయాలని చెప్పినా ఇంకా పూర్తి కాలేదన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల డేటా సేకరించి నమోదు చేయాలని స్పష్టం చేశారు. కాంట్రాక్టు ఉద్యోగుల డేటా పూర్తి చేయాలన్నారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎక్కడ పనిచేస్తున్నదీ మ్యాపింగ్ చేయాలన్నారు. జిల్లాలో 1488 మంది డీడీఓలు ఉండగా జిల్లాలో మొత్తం 24,874 మంది ఉద్యోగులు ఉన్నట్లు చెప్పారు. 24040 మంది ఉద్యోగులు ఈకెవైసీ పూర్తి చేశారని మిగిలిన వారివి కూడా పూర్తి చేయాలన్నారు. పెన్షనర్లు ఎక్కువగా ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందని, జిల్లా కేంద్రంలోనూ చేస్తామని, 11వ తేదీ నాటికి పూర్తి చేయాలని సూచించారు.

'మా పాతికేళ్ల కలను నిజం చేశారు'


సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, డీఎస్సీ-98 ఉపాధ్యాయులు


కాశీబుగ్గ: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిరుద్యోగుల పక్షపాతి అని, పాతికేళ్ల కలను నిజం చేశారని డీఎస్సీ 1998 ఉపాధ్యాయులు అన్నారు. పలాసలో మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద మంత్రి సీదిరి అప్పలరాజుతో కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చిత్రపటానికి సోమవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాడు ప్రతిపక్ష నేత హోదాలో జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీ ప్రకారం.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగం కల్పించారని ఆనందం వ్యక్తం చేశారు. గతంలో చాలా ప్రభుత్వాల దృష్టికి సమస్య తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని, తమను గురువుల స్థానంలో నిలబెట్టిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని, ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటామని తెలిపారు. అనంతరం మంత్రిని దుశ్శాలువతో సత్కరించారు.

స్పందనకు 238 అర్జీలు


స్పందనలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న జేసీ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్పందనకు వచ్చిన అర్జీలు పెండింగ్‌లో లేకుండా చూడాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఆయన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ ఓపెన్‌లో 6 అర్జీలు పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. ఇందులో ఎస్ఈబీ, పోలీసు, డీపీఓ, మున్సిపల్ పరిపాలన, ఈపీడీసీఎల్, దేవదాయ శాఖల్లో ఉన్నాయని తెలిపారు. అర్జీదారుల ఫొటోలను క్లారిటీతో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. మొత్తం 238 అర్జీలను స్వీకరించారు. అర్జీల స్వీకరణలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, ఉప కలెక్టర్లు జి.జయదేవి, సుమబాల, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్ పాల్గొన్నారు. స్పందన కార్యక్రమంలో జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం జగనన్న సంక్షేమ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఉద్యమాలు చేసిన, ఉపాధ్యాయులపై పెట్టిన కేసులు ఎత్తి వేయాలని కోరుతూ ఏపీ జేఏసీ అమరావతి ప్రతినిధులు స్పందనలో వినతి పత్రం అందజేశారు.

పోలీసు స్పందనకు 47 వినతులు


మాట్లాడుతున్న ఎస్పీ జీఆర్ రాధిక

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా పోలీసు స్పందనకు సోమవారం 47 వినతులు అందాయి. సోమవారం పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్పీ జీఆర్ రాధిక వినతులను స్వీకరించారు. స్వయంగా బాధితులతో మాట్లాడారు.

బహుదాపై కొత్త వంతెనకు సర్వే పూర్తి

ఇచ్ఛాపురం రూరల్: బ్రిటిష్ హయాంలో నిర్మించిన బహుదా వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మాణానికి సర్వే పూర్తయిందని రోడ్లు, భవనాల శాఖ డీఈ ఎస్.రామినాయుడు అన్నారు. హైదరాబాద్‌కు చెందిన స్టెక్ ఇన్‌ఫ్రాకు చెందిన సంస్థ సర్వే టీమ్ సభ్యుడు నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం బహుదా నది వంతెన వద్ద నిర్వహించిన సర్వేను ఆయన పరిశీలించారు. కలెక్టర్ శ్రీకేశ్ బి.లాఠకర్, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయల ప్రతిపాదనల మేరకు బహుదా నదిపై నూతన వంతెన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.200 కోట్లు మంజూరు చేస్తున్న నేపథ్యంలో సర్వే చేపట్టామని తెలిపారు. తహసీల్దార్ సదాశివుని గురుప్రసాద్, జేఈ మోహన్, సర్వే బృందం సభ్యులు అలీ, నందీప్, ఏపీ రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరావురెడ్డి, ఉప్పాడ రాజారెడ్డి, పిట్ట మామయ్య, రాంపత్ని చిట్టిబాబులు ఉన్నారు.

ఆత్మీయ సమ్మేళనం


ఇచ్ఛాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1976–77లో పదో తరగతి చదివిన వారు సోమవారం మళ్లీ కలిశారు. తమ స్కూల్‌లో వాహనాలు ఉంచేందుకు షెడ్‌ను ఏర్పాటు చేసి ప్రారంభించారు. – ఇచ్ఛాపురం

విగ్రహం..కళానుగ్రహం



స్వేచ్ఛావతి అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా కంచ్రవీధి రాధాకృష్ణ మందిరంలో ఏర్పాటు చేసిన వినాయకుడి సైకత శిల్పం అందరినీ ఆకట్టుకుంటోంది. సోమవారం ఈ శిల్పాన్ని ఏర్పాటు చేశారు. – ఇచ్ఛాపురం

తరువు తనువంతా..



పలాస మండలం మామిడిమెట్టు పంచాయతీ రంగోయి గ్రామం చినలోహరబంద గ్రామాల మధ్య ఓ రైతుకు చెందిన పనస చెట్టు ఇది. మొదలు నుంచి చిగురు వరకు పోటీ పడి పనస కాయలు కాశాయి.

– కాశీబుగ్గ

ఉద్దానంలో ఉత్సవ శోభ



ఉద్దానం ఉత్సవ శోభతో కళకళలాడుతోంది. తీర ప్రాంత మత్స్యకార గ్రామదేవత పెద్దమ్మతల్లి అమ్మవారు, బైరెడ్లపుట్టుగ గ్రామ దేవత భూలోకమాత, ఆర్.కరాపాడు గ్రామ దేవత శ్యామలమ్మ అమ్మవారి పండుగలు ఆయా గ్రామాల్లో అంగరంగవైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాలను తిలకించేందుకు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు. – కవిటి

11న చెస్ ఎంపిక పోటీలు



శ్రీకాకుళం జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీన గురువారం జిల్లా స్థాయి చెస్ ఎంపిక పోటీలు జరగనున్నాయని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు బగాది కిశోర్ తెలిపారు. ఈ పోటీలు గురువారం ఉదయం 9 గంటల నుంచి శ్రీకాకుళం నానుబాలవీధిలో గల జిల్లా చెస్ అసోసియేషన్ కోచింగ్ సెంటర్‌లో జరుగుతాయన్నారు. ఎంపికైన క్రీడాకారులను ఈ నెల 18 నుంచి 21 వరకు విజయవాడలో జరగనున్న సీనియర్స్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలకు పంపిస్తామన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఏపీచెస్.ఓఆర్జీ వెబ్‌పోర్టల్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని, ఎంట్రీ ఫీజుగా రూ.200 చెల్లించాల్సి ఉంటుందని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకు వివరాలకు 9912559735 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

–శ్రీకాకుళం న్యూకాలనీ

బెస్ట్ ఆఫ్ లక్ రూపా



సంతవురిటి గ్రామానికి చెందిన పారా బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పడాల రూపాదేవి సోమవారం థాయిలాండ్ చేరుకుంది. సోమవారం నుంచే అక్కడ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో రూపాదేవి సత్తా చాటాలని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు.

– జి.సిగడాం

క్లుప్తంగా

నేడు వాసుదేవుని సన్నిధిలో వసంతోత్సవం

మందస: మందస పట్టణంలోని వాసుదేవ స్వామి ఆలయంలో మంగళవారం వసంతోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు సోమవారం తెలిపారు. ఆలయ పునఃప్రతిష్ట జరిగి 14 సంవత్సరాలు కావస్తోందని, ఈ సందర్భంగా వాసుదేవుడు, రాజ్యలక్ష్మి అమ్మవార్లకు వసంతోత్సవ అభిషేకం, అలంకరణ, అర్చనలు జరుగుతాయన్నారు. స్వామి జన్మనక్షత్రమైన మూలా నక్షత్రయుత పూజలు, ఉత్తర ద్వార దర్శనం కూడా కల్పిస్తామన్నారు. ఉదయం ఎనిమిది గంటలకు వాసుదేవస్వామి మూలమూర్తికి, ఉత్సవవర్తకు ఉభయ దేవేరుల సమేతంగా పూజలు ప్రారంభమవుతాయన్నారు. భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ఏఎస్పీకి కాంగ్రెస్ నాయకుల వినతి



ఏఎస్పీ విఠలేశ్వరరావుకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

శ్రీకాకుళం అర్బన్: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, అతని కుటుంబ సభ్యులను హతమారుస్తామని హెచ్చరించిన బీజేపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు జిల్లా అదనపు ఎస్పీ టి.పి.విఠలేశ్వరరావును తన కార్యాలయంలో సోమవారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. కర్ణాటకలో జరుగుతున్న ఎన్నికల ప్రచారంలో భాగంగా ఖర్గేని, అతని కుటుంబాన్ని హతమారుస్తానని చిత్తాపూర్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి మణికంఠ రాథోడ్ హెచ్చరించిన ఆడియో బయటపడిందని ఏఎస్పీకి నాయకులు వివరించారు. ఎమ్మెల్యే మణికంఠను అరెస్టు చేయాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. ఏఎస్పీని కలిసి వారిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దేశెళ్ల గోవింద మల్లిబాబు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కె.వి.ఎల్.ఎస్.ఈశ్వరి, కూరాకుల వెంకటరావు ఉన్నారు.

ఐఐఎమ్‌లో ఆమదాలవలస విద్యార్థి ప్రతిభ

- ఐదో స్థానం పొందిన వెంకటవాసుదేవరావు



ఆమదాలవలస రూరల్: ఆమదాలవలస పట్టణంలోని బీఆర్‌నగర్ ప్రాంతానికి చెందిన యజ్జల వెంకట వాసుదేవరావు ఐఐఎమ్‌లో ప్రతిభ చూపి దేశంలోనే ఐదో స్థానాన్ని సాధించాడు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎమ్)లో క్యాట్ 98 శాతం ఫలితాన్ని ఉత్తీర్ణత సాధించి ఇంటర్వ్యూలో తన ప్రతిభ చూపించి కోజికోడ్‌కు ఎంపికయ్యాడు. దేశంలో ఐఐఎమ్ ఫలితాల్లో మొదటి పది స్థానాలను ఎంపిక చేస్తారు. అందులో వాసుదేవరావు ఐదో స్థానంలో నిలవడం గర్వంగా ఉందని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బీటెక్‌ను పూర్తిచేసి ఐఐఎమ్‌లో మంచి ఫలితాన్ని సాధించడంతో 2023–25 కోజికోడ్‌కు ఎంపిక కావడంతో ఎంతో ఆనందంగా ఉందని విద్యార్థి వాసుదేవరావు తెలిపారు. మంచి కంపెనీలో సీఈవోగా స్థిరపడడమే తన లక్ష్యమన్నారు. తండ్రి వరప్రసాదరావు పంచాయతీ కార్యదర్శిగా, తల్లి సుజాత ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు.

సేవల్లో సిక్కోలు ఫస్ట్



జిల్లాలోని పలు విభాగాల్లో రెడ్‌క్రాస్ జిల్లా శాఖ ద్వారా అందించిన సేవలకుగాను రాష్ట్ర వ్యాప్తంగా శ్రీకాకుళం జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. ఇందుకుగాను రెడ్‌క్రాస్ అధ్యక్షుడు, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ రాజ్‌భవన్‌లో గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ చేతులమీదుగా బంగారు పతకం అందుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర చైర్మన్ శ్రీధర్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ, సీఈఓ. పరిదా, శ్రీకాకుళం జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్ మోహన్‌రావు తదితరులు ఉన్నారు.

–శ్రీకాకుళం అర్బన్

ఆదిత్య విద్యాసంస్థలకు రెడ్‌క్రాస్ పురస్కారం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): సేవలకు గుర్తింపుగా ఆదిత్య విద్యాసంస్థలను రెడ్‌క్రాస్ పురస్కారం వరించింది. విజయవాడ రాజ్‌భవన్‌లో నిర్వహించిన వేడుకల్లో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్.సుగుణారెడ్డికి అందజేశారు. టర్కీ, సిరియాలలో సంభవించిన భూ కంప సమయంలో ఆదిత్య విద్యాసంస్థలు సమకూర్చిన రూ.48 లక్షల విరాళం రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా అప్పట్లో అందజేశారు. అత్యధికంగా 2,200 మంది రక్తదానం చేశారు. వీటన్నింటిని పరిగణలోకి తీసుకుని రాష్ట్రవ్యాప్తంగా 13మందికి పురస్కారాలు అందజేయగా కాకినాడ నుంచి ఆదిత్యకు అందజేశారు.

ఈ సందర్భంగా డైరెక్టర్ సుగుణారెడ్డిను విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు అభినందించారు.



సుగుణారెడ్డికి పురస్కారం అందజేస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

'నీట్' తప్పతానేమోనని.. ప్రాణం తీసుకున్నాడు..

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళంలోని పీఎస్ కాలనీ 10వ లైన్‌కు చెందిన ససపల హర్షవర్ధన్(19) సోమవారం ఆత్మహత్యకు పాల్పడినట్లు రెండో పట్టణ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. నీట్ పరీక్ష తప్పుతానేమోనని భయపడి విద్యార్థి ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. పీఎస్ కాలనీ పదో లైన్‌కు చెందిన హర్షవర్ధన్ ఇంటర్ పూర్తయ్యాక నీట్ ఎగ్జామ్స్ కోచింగ్ తీసుకుని ఆదివారం శివానీ కాలేజీలో పరీక్ష రాశాడు. అదే రోజు రాత్రి వచ్చిన కీ చూసుకుని తక్కువ మార్కులు వస్తున్నాయని బాధ పడ్డాడు. దీంతో విద్యార్థిని తండ్రి రంగబాబు ఓదార్చారు. విద్యార్థి తల్లి వారం కిందట పుట్టింటికి వెళ్లడం, సోదరి బెంగళూరులో చదువుతుండడంతో తండ్రీకొడుకులు మాత్రమే ఉన్నారు. సోమవారం ఉదయం రంగబాబు బయటకు వెళ్లారు. మధ్యాహ్నం 1 గంట సమయంలో హర్షవర్ధన్‌కు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయలేదు. ఇంటికి వచ్చి చూస్తే తలుపులు మూసి ఉన్నాయి. కిటికీలో నుంచి చూడగా హర్షవర్ధన్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. దీంతో తండ్రి నిశ్చేష్టుడైపోయాడు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య



గేదెల అమ్మడు (ఫైల్)

బూర్జ: మండలంలో గల తోడవాడ గ్రామానికి చెందిన గేదెల అమ్మడు (30) అనే వివాహిత సోమవారం సాయంత్రం ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గేదెల అమ్మడుకి ఎనిమిదేళ్ల కిందట గేదెల సాయికుమార్‌తో వివాహమైంది. వీరిది కులాంతర ప్రేమ వివాహం. వీరికి రెండు, నర్సరీ చదువుతున్న ఇద్దరు కుమారులు ఉన్నారు. కొంతకాలంగా కుటుంబ కలహాలు ఉన్నట్లు సమాచారం.

ఈ చిన్ని చిన్న ఘర్షణల వల్లే అమ్మడు ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. సాయికుమార్ వివాహాలకు అలంకరణ సామగ్రి అద్దెకు ఇస్తుంటారు. ఈ ఆత్మహత్యపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

దివ్యాంగులకు అండగా ప్రభుత్వం

నరసన్నపేట: దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. వారి అభివృద్ధి, సంక్షేమానికి చిత్తశుద్ధితో పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మూడు చక్రాల స్కూటీలను ఉచితంగా ప్రభుత్వం మంజూరు చేయగా నియోజకవర్గంలోని పది మంది దివ్యాంగులకు వీటిని నరసన్నపేటలో సోమవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులు పడుతున్న బాధలను సీఎం జగన్ తన పాదయాత్రలో కళ్లారా చూశారన్నారు. తాము అధికారంలోకి వస్తే మూడు చక్రాల స్కూటీలను పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారని.. దీంట్లో భాగంగా అర్హత కలిగిన దివ్యాంగులకు వీటిని మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక జరిగిందన్నారు. గతంలో జన్మభూమి కమిటీల పేరుతో ప్రతి పథకానికి టీడీపీ వాళ్లకు ముడుపులు చెల్లించాల్సి వచ్చేదని.. ఇప్పుడు ఎటువంటి అవినీతి లేకుండా అర్హతే ప్రామాణికంగా పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వికలాంగ సంక్షేమ శాఖ ఏడీ కె.కవిత మాట్లాడుతూ.. జిల్లాలో 80 మందికి మూడు చక్రాల స్కూటీలు మంజూరైనట్లు తెలిపారు. ఒక్కో యూనిట్ ధర రూ. 1.20 లక్షలు కాగా మొత్తం ఉచితమన్నారు. లబ్ధిదారులు సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపీపీలు ఆరంగి మురళి, వాన గోపి, పార్టీ నాయకులు చింతు రామారావు, మద్దాడ బైరాగినాయుడు, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, సొసైటీ అధ్యక్షుడు పొన్నాన దాలినాయుడు, నాలుగు మండలాల ఎంపీడీవోలు పాల్గొన్నారు.



దివ్యాంగురాలుకి మూడు చక్రాల స్కూటీని అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్ తదితరులు

ఐఏఎల్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడుగా అన్నంనాయుడు



కూన అన్నంనాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఇండియా అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడుగా శ్రీకాకుళం బార్ అసోసియేషన్ పరిధికి చెందిన న్యాయవాది కూన అన్నంనాయుడు నియమితులయ్యారు. రాజమండ్రిలో ఇటీవల జరిగిన ఐఏఎల్ 11వ మహాసభలో ఈయన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు ముప్పాల సుబ్బారావు సోమవారం తెలిపారు. అన్నంనాయుడు ప్రస్తుతం బీసీ అడ్వకేట్ జిల్లా యూనిట్‌లో బాధ్యులుగా ఉన్నారు. అన్నంనాయుడును జిల్లా బీసీ అడ్వకేట్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఆగూరు ఉమామహేశ్వరరావు, చౌదరి లక్ష్మణరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు, కార్యదర్శి పొన్నాడ రాము, ఆరకితోట క్రిష్ణంరాజు అభినందించారు.

మీ సాయం మరువలేనిది

సోంపేట: సోంపేట పట్టణానికి చెందిన పొందూరు చిన్నారావు కృతజ్ఞతను చాటుకున్నారు. గతంలో ఇతని కుటుంబ సభ్యుడు విదేశాల్లో చనిపోయారు. మృతదేహాన్ని వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పిరియా సాయిరాజ్ తన సొంత ఖర్చులతో సోంపేటకు రప్పించారు. ఆ కృతజ్ఞతతో సోంపేటలో సోమవారం నిర్వహించిన గడప గడపకు కార్యక్రమంలో భాగంగా వచ్చిన సాయిరాజ్‌ను చిన్నారావు కౌగిలించుకుని చేసిన సాయాన్ని గుర్తు చేశారు.



సాయిరాజ్‌ను కౌగిలించుకున్న చిన్నారావు

ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా కామరాజు



నియామక పత్రం అందుకుంటున్న కామరాజు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా బడియా కామరాజు ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని సోమవారం ఆయన తెలిపారు. విజయవాడలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పూర్వ అధ్యక్షుడు జె.బి.రాజు ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగినట్లు చెప్పారు. ఇప్పటికే విజయనగరం డివిజన్ ఏపీసీటీసీ అండ్ ఎస్టీ, ఎస్సీ ఎంప్లాయీస్ అధ్యక్షునిగా పని చేస్తున్నట్లు చెప్పారు. కామరాజు ఎన్నికపై దళిత సంఘ నాయకులు కంఠ వేణు, క్షేత్రపల్లి రాంగోపాల్, పిట్ట చంద్రపతిరావు, రాయి వేణుగోపాల్ హర్షం వ్యక్తం చేశారు.

మైనర్‌పై అసభ్యకర ప్రవర్తన

- యువకుడిపై పోక్సో కేసు నమోదు

వజ్రపుకొత్తూరు: మైనర్‌పై ఓ వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. పూండికి సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో పని చేస్తున్న కొమరల్తాడ గ్రామానికి చెందిన 30 ఏళ్ల కొంకి పవన్ మైనర్ బాలికకు ఐస్‌క్రీమ్, కూల్ డ్రింకు ఇచ్చి లోబరుచుకున్నాడు. బాత్‌రూంకు తీసుకెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించాడని బాలిక పోలీసులకు వాంగ్మూలం ఇచ్చింది. దీంతో ఆమెను పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ విషయాన్ని వజ్రపుకొత్తూరు ఎస్సై వై.మధుసూదనరావు వద్ద ప్రస్తావించగా బాలికపై పవన్ అసభ్యకరంగా ప్రవర్తించాడని చెప్పారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పవన్‌ను అదుపులోకి తీసుకుని పోక్సో యాక్టు కింద కేసు నమోదు చేశామన్నారు.

అంకితభావంతో విధుల నిర్వహణ

- ఎస్పీ జి.ఆర్.రాధిక



మాట్లాడుతున్న ఎస్పీ జీఆర్ రాధిక

శ్రీకాకుళం క్రైమ్: అంకిత భావంతో విధులు నిర్వహించి ప్రజలకు, పోలీసులకు సంధానకర్తలుగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక అన్నారు. మహిళల భద్రతకు కృషి చేయాలన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మహిళా పోలీసుల విధివిధానాలు, ప్రజా, మహిళల భద్రత, యువత సన్మార్గంలో నడిపించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మహిళా పోలీసులతో వీడియో కాన్ఫరెన్స్ సోమవారం నిర్వహించారు. మనపై ఉన్న బాధ్యతను అధికారికంగా భావించకుండా నేర రహిత సమాజం కోసం కృషి చేయాలన్నారు. క్రమశిక్షణతో పని చేయాలని, అంకితభావంతో విధులు చేపట్టాలన్నారు. ప్రతిఒక్కరూ జాబ్ రూల్స్ పాటించాలని, ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలన్నారు. యువతతో సమాజంలో మార్పు వస్తోందన్నారు. యువతపాత్ర కీలకమన్నారు. ప్రతిమహిళ పోలీసు తమ పరిధిలోని సుమారు 20 మంది యువకులను గుర్తించి సైబర్ నేరాలు, ట్రాఫిక్, నైటబీట్లు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా సందేశాత్మక అంశాలు, ముఖ్యమైన చట్టాలపై ఐదు రోజులు శిక్షణ ఇవ్వాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ టి.విఠలేశ్వరరావు, సీఐ ప్రసాదరావు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమం



అర్హులందరికీ సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందజేస్తున్నారని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. బూర్జ మండలం లాభాం, నారాయణపురం గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ప్రజలను కలిసి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమాన్ని వివరించారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌కు అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

–బూర్జ

కార్యకర్తలే వైఎస్సార్‌సీపీకి బలం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు


- వారితోనే 'గడప గడపకు మన ప్రభుత్వం' విజయవంతం
- 2024లో వైఎస్సార్‌సీపీ విజయానికి కలిసికట్టుగా పనిచేయాలి
- మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్‌కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ విప్లవాన్ని సృష్టించి ప్రజల వద్ద కార్యకర్తలకు ఎంతో గౌరవాన్ని పెంచిందని రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. వైఎస్సార్‌సీపీ బలం కార్యకర్తలేనన్నారు. శ్రీకాకుళం నగరంలోని టౌన్‌హాల్‌లో సోమవారం నిర్వహించిన నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత కొన్ని నెలలుగా జరుగుతున్న 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం విజయవంతం కావడానికి కార్యకర్తలే కారణమన్నారు. దీనికి ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని.. వైఎస్సార్‌సీపీ గ్రాఫ్ పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంతోనే ప్రభుత్వం అందించే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించగలిగామన్నారు. సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపించి పనులు పూర్తి చేయగలిగామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో కొద్ది రోజులు కార్యక్రమం నిర్వహణకు ఆటంకం తలెత్తిందన్నారు. అయినా 57 కార్యక్రమాలు పూర్తిచేయగలిగామన్నారు. మిగిలిన సచివాలయాల పరిధిలో కూడా పూర్తిచేసేందుకు సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు. వలంటీర్ల పనితీరుపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అందరు పార్టీ కోసం పనిచేసేలా చొరవ చూపాలన్నారు. వైఎస్సార్ ఆసరా నిధుల పంపిణీ సభలను నియోజకవర్గం పరిధిలో 12 చోట్ల నిర్వహించగా అధిక సంఖ్యలో మహిళలు హాజరవ్వడానికి కార్యకర్తలే కారణమన్నారు. 2024లో జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. అవినీతిలేని పాలన అందించి ప్రజలకు మంచి చేయడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. పార్టీ కోసం పూర్తిస్థాయిలో పనిచేయలేనివారు తప్పుకుని ఆసక్తిగల వారికి అవకాశం కల్పించాలని సూచించారు. రెండో విడత గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగే ప్రతి గ్రామం, వార్డులో పాల్గొంటానన్నారు. బూత్‌స్థాయిలో ఉన్న లోపాలను సరిదిద్దుకోవాలని. తమ ఓటర్లను గుర్తించి పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. డెడికేటెడ్ నెట్‌వర్క్‌తో ఈ నెల 17న మరోసారి ప్రత్యేక సమావేశం నిర్వహిస్తానన్నారు. రూరల్ మండల నాయకుడు అంబటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో తూర్పుకాపు, కళింగవైశ్య కార్పొరేషన్ల చైర్మన్లు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, నాయకులు సాధు వైకుంఠరావు, గొండు రఘు, మూకళ్ల తాతబాబు, వై.వి.సూర్యనారాయణ, ఎం.వి.స్వరూప్, పీస గోపి, పైడి రాజారావు, పి.సుగుణారెడ్డి, ఊడి నంజన, గుంట జ్యోతి, తోట తారక్ పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య సమాచారం సిద్ధంగా ఉండాలి

- జిల్లా ప్రత్యేకాధికారి సిద్ధార్థ జైన్

హిరమండలం: ప్రజల ఆరోగ్య, ఇతర సంక్షేమ పథకాల సమాచారం అధికారుల వద్ద సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ల్యాండ్ సెటిల్మెంట్ కమిషనర్, జిల్లా ప్రత్యేకాధికారి సిద్ధార్థ జైన్ అన్నారు. హిరమండలం పీహెచ్‌సీని సోమవారం పరిశీలించారు. రోగులతో మాట్లాడి అందుతున్న సేవలపై ఆరా తీశారు. ప్రజలకు అందిస్తున్న సేవలపై సిబ్బందితో సమీక్షించారు. ప్రభుత్వం అందిస్తున్న ఆరోగ్య పథకాలు, రికార్డుల నిర్వహణను వైద్యురాలు సాయిగీతను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బ్యారేజ్ సెంటర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. బాలింతలకు గర్భిణులు, చిన్నారులకు అందజేస్తున్న పౌష్టికాహారం వివరాలను జిల్లా స్త్రీశిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ జయదేవుని నుంచి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధన దిశగా పని చేస్తున్నామన్నారు. టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్, టెక్కలి డివిజన్ డీఎంహెచ్‌వో లక్ష్మీతులసీ, కొత్తూరు ఐసీడీఎస్ పీవో విమలరాణి, తహసీల్దార్ మురళీమోహన్, ఎంపీడీవో శైలజ పాల్గొన్నారు.



హిరమండలం పీహెచ్‌సీని పరిశీలిస్తున్న సిద్ధార్థ జైన్

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కె. 10గ్రా.)	61,750–00
బంగారం(22కె. 10గ్రా.)	56,600–00
వెండి (కిలో)	82,700–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹135	₹240	₹ 250